
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## -37-

## పంతులు పిలకా-సాయబు గెడ్డం

**మొన్నటి ఫిబ్రవరి** 24–25, 2020 తేదీలలో అమెరికా అధ్యక్షుడు డానల్డ్ ట్రంప్ గారు సకుటుంబ సపరివారంగా మన పవిత్ర భారత్ మహాన్ సందర్శించుకున్నారు. ఆయన అహ్మదాబాద్ లో దిగిన దగ్గర నుంచి, మళ్ళీ అమెరికా వెళ్ళిపోయేదాకా ప్రపంచం కరోనా వైరస్ తోటీ, ఢిల్లీ మహా నగరం పౌరసత్వ సవరణ బిల్లు గొడవల తోటీ సతమతం అయినా భారత దేశం మటుకు ట్రంప్ గారి రాకతో పులకరించి పోయింది అనే చెప్పాలి. ఇక మోడీ గారూ, రాష్ట్రపతి కొవింద్ గారూ అయితే ట్రంప్ గారి ఇచ్చుకో పుచ్చుకో పద్ధతి లో చేసుకున్న ఆలింగనాలు గినెస్ బుక్ లో కి ఎక్కాయి.

నాకున్న లోపాయికారీ సమాచారం ప్రకారం అసలు జరిగినది ఏమిటంటే...ఒక రోజు అర్ధ రాత్రి మెలామియా గారు తన పడక గది లోంచి పక్కనే ఉన్న ట్రంప్ గారి పడక గదిలోకి వెళ్ళారు. వాళ్ళిద్దర్రూ వైట్ హౌస్ లో వేరే గదుల్లో పడుకుంటారు అన్నది కూడా నాకున్న లోపాయికారీ సమాచారం. ఆమె అలా చడీ చప్పుడూ చెయ్యకుండా, సిసి కెమేరాలు ఉంటాయి కదా అనే మాట మర్చిపోయి నిద్రపోతున్న ట్రంప్ గారిని గోముగానో ఘాట్టిగానేనో ఒక క్వీన్ విక్టోరియా మార్కు టెంకి జెల్ల కొట్టారు. దాంతో ఆ మానవుడు బిత్తర పోయి సాక్షాత్తూ తన స్వంత భార్య ని చూసి కంగారు పడి, తేరుకుని, తల తడుముకుంటూ, కళ్ళు నులుము కుంటూ "ఏల్ కొట్టితివి? ఏమి నీ కోరిక. నువ్వు కూడా నన్ను ఇంపీచ్ చేయుచుంటివా?" అని అడిగారు. దానికి ఆమె చిరునవ్వుతో "లేదు, అధ్యక్షా. నాకు తాజ్ మహల్ చూడాలని ఉంది. నువ్వేమో ఇప్పుడు ఇంపీచ్ మెంట్ లోనో, తరవాత ఈ యేటి ఎన్నికలలోనో ఓడి పోయేలా ఉన్నావు. ఆ ఘోరం జరిగే లోగా అర్జంటుగా ఇండియా వెళ్ళి తాజ్ మహల్ ఒహటీ చూసి వచ్చేద్దాం. ఆ గెడ్డపాయన మోడీ నీకు భక్తుడే కదా!" అని మెలానియా గారు తన కోరిక వెళ్ళబుచ్చారు. అదన మాట ట్రంప్ గారు భారత దేశం రావడానికి అసలు కారణం. అలా అని కేవలం తాజ్ మహల్ కోసమే వస్తున్నాం అంటే బావుండదు కాబట్టి కూడా ఏదో సరదాగా ఓ పాతిక వేల కోట్ల ఆయుధాలు కూడా జేబులో వేసుకుని అమ్ముకునే కార్యక్రమం కూడా పెట్టించారు ట్రంప్ గారు.

ఇక ఎప్పుడయితే ట్రంప్ గారూ, మెలానియా గారూ, ఆయనకి కుమార్తె ఆమెకి సవతి కూతురు అయిన ఇవాంకా గారూ, ఆమె భర్త కుష్నర్ గారూ మందీ మార్బలం తో వస్తున్నారు అని తెలిసిందో ఢిల్లీ లో "ఆలింగన శిక్షణ శిబిరం' "గాలిలో కరచాలన శిబిరం," మొదలైనవి మొదలయ్యాయి. ఇందులో చిన్న చిన్న ఆలింగన, ఎముకలు విరిగే కావిలింత, ఆలింగిస్తూనే వీపు గోకుడు, మగాడిని మగాడే వాటేసు కోవడం, భారత మగాడు అమెరికా ఆడంగులని అర్జంటూగా వాటేసుకోకుండా నిబ్బరం పాటించడం, మామూలు కరచాలనం, అమెరికా వాడి చేతిని

పొలో మని నవ్వేస్తూ ఊపేసి ఆనందించడం, చేతిలో చెయ్యి వేశాక ఆ రెండు చేతులనీ అలా గాలి లోకి లేపేసి అక్కడ ఊపేయడం, ఈ వెకిలి చేష్టలనింటినీ కేవలం కెమేరాలు ఉన్న వేపే చూస్తూనో, అందునా ఫారిన్ వాళ్ళ కెమేరాలు కనపడితే మరి కొంత పులకింత...,,ఇలాంటి దౌత్యపరమైన విషయాలలో మోడీ గారూ, రాష్ట్రపతి గారూ ఆరితేరిన నాయకులు గా చరిత్ర లో నిలిచి పోయే విధంగా శిక్షణ పొందారు.

అయితే ఈ ఆలింగనాల యవ్వారం ట్రంప్ గారికి కొత్తేమీ కాదు. నిజానికి ఆయన క్రిందటేడు హౌడీ మోడీ కి మా హ్యూస్టన్ వచ్చినప్పుడు కొంచెం ప్రాక్టీసు ఉంది. అంతకు ముందు వారిద్దరూ మొదటి సారి కలుసుకున్నప్పుడు మోడీ గారు హఠాత్తుగా దూసుకు పోయి ట్రంప్ గారిని రెండు చేతులా చుట్టేసి, వీపు గోకేసినప్పటి షాక్ నుంచి తేరుకోడానికి ట్రంప్ గారికి చాలా కాలమే పట్టింది. ఇలాంటి ఆలింగన అవాంతరాలని ఎదుర్కోడానికి, కొండొకచో పున:కావిలింత...అంటే తనే తిరిగి కావిలించుకుని అవతలి వీరుడి వీపు నిమరడానికి ట్రంప్ గారు కూడా వైట్ హౌస్ లో శిక్షణా శిబిరం పెట్టుకున్నారు. ఏమో అలాంటి అవసరం రేప్పొద్దున్న స్పీకర్ నాన్సీ పెలోసీ గారితోటే రావచ్చును కదా!. పైగా వైట్ హౌస్ లో పడక గదులు వేరు కాబట్టి కాస్త అలవాటు తప్పిందేమో. మెలానియా గారి తో కూడా పబ్లిక్ లో ఉన్నప్పుడు కేవలం చిటికిన వేలు పట్టుకునే నడుస్తారు కానీ వారిద్దరూ ఆలింగనాల జోలికి వెళ్ళగా నేను చూడ లేదు. ఇంతకీ అసలు చెప్పొచ్చేది ఏమిటంటే, భారత ప్రధాని, రాష్ట్రపతి అమెరికా అధ్యక్షుడి కరచాలనం, ఆలింగనాల మీద చూపించిన ఆసక్తి భలే నవ్వు తెప్పించింది. తెల్ల తోలు మీద మన నాయకులకి ఇంకా ఆరాధనా భావం తగ్గ లేదు అనే అనిపించింది. ఈ ఆలింగనాల పర్వం లో మోడీ గారు ముందడుగు వెయ్యగానే వెనకడుగులు వేసి ఆలింగన ప్రమాదం అంచుల నుంచి మెలానియా గారూ, ఇవాంకా గారూ కాపాడుకున్నారు.

ఇక భారత దేశం లో ఉండగా ట్రంప్ గారి ఉవాచలు అచ్చు ట్రంప్ గారి ఉవాచల లాగానే ఉన్నాయి. ఆ మాటకొస్తే అసలు అమెరికా నాయకుడు ఎవరైనా సరే...ఏ పార్టీకి చెందినా సరే....అందరూ వ్యాపారులే. వారికి కావలసినది అమెరికా ప్రయోజనాలు మాత్రమే. ట్రంప్ గారు ఏదో భారత దేశాన్ని ఆకాశానికి ఎత్తేసినంత మాత్రాన ఆయన మనల్ని ఆరాధిస్తున్నాడు అనుకుంటే పప్పులో కాలు వేసినట్టే. నిజానికి అహ్మదాబాద్ లో ఆయన పొగిడినది అమెరికాలో ఉన్న 40 లక్షల మంది గుజరాతీ వాళ్ళని. ఈ ఏడు జరిగే అమెరికా అధ్యక్షుడి ఎన్నికలలో మన భారతీయుల ఓట్లు తక్కువే కానీ డబ్బు ఎక్కువే. ట్రంప్ గారికి మన డబ్బు కంటే మన వాళ్ళ ఓట్లు ఎన్ని పడితే అంత మంచిది. ట్రంప్ గారు గుజరాతీ పర్యటనకి అదే ముఖ్య కారణం. అక్కడ మొతేరా స్టేడియం లో జరిగిన నమస్తే ట్రంప్ కి లక్షా పాతిక వేల మంది రావడం గొప్ప విశేషమే. అంత మంది జనాలని ఆ ట్రంప్ పరివారం అమెరికా లో కానీ ఇంకెక్కడా చూసే అవకాశం లేక పోయినా ఒక ట్రంప్ వ్యతిరేక అమెరికా చానెల్ లో "అదేమీ గొప్ప విషయం కాదు. ఇండియా లో లక్షమంది వస్తే అమెరికాలో వెయ్యి మంది వచ్చినట్టే" అని వ్యాఖ్యానించడం కూడా సమర్ధనీయం కాదు. అవసరం లేకపోయినా "నువ్వే కాదు. అటు పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కూడా నాకు గొప్ప స్నేహితుడే" అని ట్రంప్ గారు రెండు, మూడు సార్లు మోడీ కి చెప్పడం అంటే 'తస్మాత్ జాగ్రత్త" అని చెప్పడమే.

మొత్తానికి ఈ టంప్– మోడీ తతంగం అంతా చూస్తుంటే "పంతులు పిలక కీ సాయెబు గెడ్డానికీ కావలసినది ఒకటే కత్తి" అనే మా చిన్నప్పటి సామెత ఒకటి గుర్తుకి వచ్చింది. అంటే ఇక్కడ రెండు దేశాలకీ కావలసినదీ ఒకటే....వ్యాపారం. ఆయనేమో ఆయుధాలు, చికెన్ లెగ్గులు, హార్లీ డేవిడ్సన్లూ అమ్ముకుంటాడు. ఈయనేమో ఐటి ఉద్యోగులని ఎగుమతి చేస్తాడు. ఆయనేమో భారత పారిశ్రామిక వేత్తలని అమెరికాలో ఫేక్టరీలు పెట్టి అక్కడ ఉద్యోగాలు పెంచమంటాడు. ఈయనేమో సరిగ్గా దానికి వ్యతిరేకం. వెరసి, ఇచ్చుకో, పుచ్చుకో...పాతిక వేల కోట్ల మారణాయుధాల వ్యాపారం మధ్యలో పాప పరిహారార్థం సబర్మతీ ఆశ్రమం, రాజ్ ఘాట్ సందర్శనం చేసి మహాత్మా గాంధీ గారిని పైపైనే తల్చుకుంటూ అహింసావాదానికి నివాళులు అర్పించడం అత్యంత హాస్యాస్పదం.

**COMMENTS**